క్లుప్తంగా

సామాజిక సేవలో బర్త్ రూట్స్ ఆసుపత్రి


బారికేడ్లు అందజేస్తున్న బర్త్‌రూట్స్ ఆసుపత్రి యాజమాన్యం, డాక్టర్ శృతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా, ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసుల అభ్యర్థన మేరకు సుమారు రూ.లక్ష విలువ గల బారికేడ్స్‌ను బర్త్ రూట్స్ ఆసుపత్రి యాజమాన్యం, డాక్టర్ శృతి గోలి బుధవారం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ.సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణకు డాక్టర్ శృతి గోలి బారికేడ్స్ అందజేశారని, వారికి, ఆసుపత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుల్స్, న్యాయవాది గోలి తిరుపతి, ఆసుపత్రి సిబ్బంది రవి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దొండ సాగు పరిశీలన


దొండసాగును పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో దొండసాగును బుధవారం ఉద్యానవనశాఖ అధికారులు పరిశీలించారు. పందిరి వేసుకొని సాగు చేయడం ద్వారా చీడపీడల బాధ తగ్గి మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి రైతులకు సూచించారు. కూరగాయల సాగులో మెళుకువలను తెలియజేశారు. హార్టికల్చర్ ద్వారా వచ్చే స్కీములు గురించి తెలిపారు. ఆమె వెంట ఉద్యానవన విస్తరణ అధికారి రమేశ్, రైతులు ఉన్నారు.

పీహెచ్‌సీ సందర్శన


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల అర్బన్ పీహెచ్‌సీని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సందర్శించారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారి మానస, ఫిజీషియన్ అతుల్, కంటి వైద్యురాలు శిల్ప, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్‌గా క్రమబద్ధీకరిస్తూ కంపెనీ ఉత్తర్వులు ఇచ్చింది. భూగర్భంలో 190మస్టర్లు, సర్ఫేస్‌లో 240మస్టర్లు పూర్తి చేసిన 1258మందిని జనరల్ అసిస్టెంట్‌లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు సంస్థ సీఎండీ పీ.బలరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సింగరేణి డైరెక్టర్(పా)కు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి మధ్య జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ఏరియాల వారీగా పరిశీలిస్తే రామగుండం 1లో 156, రామగుండం 2లో 303, రామగుండం 3, అడ్రియాలలో 167, భూపాలపల్లిలో 250, శ్రీరాంపూర్‌లో 241, కార్పొరేట్‌లో 21, కొత్తగూడెంలో 20, మణుగూరులో 19, ఇల్లందులో 6, బెల్లంపల్లిలో 11, మందమర్రిలో 64మందిని క్రమబద్ధీకరించారు.

ఎస్టీపీపీలో భవనాల పరిశీలన


భవనాలను పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సింగరేణి సీబీఎస్ఈ స్కూల్ ప్రతిపాదిత భవనాలను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ ఎస్.వెంకటచారి, ఎస్టీపీపీ ఈడి చిరంజీవి, జీఎం శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. 2026–27నుంచి పాఠశాలల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లుగా తెలిపారు. అధికారులు నరసింహారావు, మురళీధర్, మధన్ మోహన్, కిరణ్‌బాబు, బీపీఎస్ఎస్ పాత్రుడు, ప్రసాద్, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ జరిగేనా?


రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదించిన అంతర్గత ప్రధాన రహదారి

- హైకోర్టులో పిటిషన్‌తో నిలిచిన పనులు
- ఓ రోడ్డును కుదిస్తారని ప్రజల్లో సందేహం
- ప్రత్యామ్నాయానికి బాధితుల డిమాండ్
- ఫైనల్ ప్లానింగ్ రిపోర్టుపై సర్వత్రా ఆసక్తి

బెల్లంపల్లి: బెల్లంపల్లి బల్దియాలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రోడ్ల విస్తరణ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించకుండా కొందరు పావులు కదపడంతోపాటు హైకోర్టులో పిటిషన్లు వేయించినా చర్యలు ప్రతికూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోడ్డు పనులు మొదలు పెట్టకుండా తాత్కాలికంగా నిలిపివేసే చర్యలు జోరుగా సాగిస్తుండడం చర్చనీయాంశంగా మారాయి. రోడ్ల విస్తరణకు నిధులు మంజూరై మూడేళ్లయినా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. ఏటా రోడ్లను విస్తరిస్తామని ప్రకటించడం, హడావుడి చేసి మార్కింగ్‌తో సరిపెడుతుండటంతో నమ్మకం లేని పరిస్థితులు ఉంటున్నాయి. ఈసారి కాస్త పట్టుదలతో రోడ్డు విస్తరణకు సిద్ధ పడగా అంతలోనే కొందరు అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అప్పటివరకు రేపో, మాపో రోడ్ల వెడల్పు పనులు చేపడతామని ప్రకటించిన అధికారులు ఒక్కసారిగా వెనుకడుగు వేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈసారైనా రోడ్ల విస్తరణ జరుగుతుందా? లేదా.. ఎప్పటి మాదిరిగానే రద్దవుతుందా? అనేది అంతుచిక్కకుండా ఉంది.

అదృశ్య శక్తుల రంగ ప్రవేశంతో..

మున్సిపాలిటీలో రూ.8.94 కోట్ల అంచనాతో కాల్‌టెక్స్–డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ ఏరియా–అంబేద్కర్ నగర్ చౌరస్తా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా–పోశమ్మ గడ్డ చౌరస్తా వరకు రోడ్లు విస్తరించాలని ప్రతిపాదించి ఆయా ప్రాంతాల రోడ్లు ఎన్ని ఫీట్ల మేరకు వెడల్పు చేయనున్నారో బహిర్గతం చేశారు. రోడ్ల వెడల్పులో ఇళ్లు, షాపులు కోల్పోయే బాధితులకు ఫైనల్ నోటీసులు కూడా అందజేశారు. రోజుల వ్యవధిలో పనులు ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు రంగ ప్రవేశం చేసి ఒక్కసారిగా బ్రేక్ వేయించారు. దీంతో సీన్ మారిపోయింది.

డీల్ విలువ రూ.25లక్షలా?

రోడ్డు వెడల్పును కుదించడానికి భారీగానే డీల్ కుదుర్చుకున్నట్లు పుర ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా ప్లానింగ్ రిపోర్టును కొందరి ద్వారా మార్చడానికి రహస్య ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. కొందరితో మంతనాలు జరిపి ఫైనల్ ప్లానింగ్ రిపోర్టులో 40 ఫీట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయించడానికి ముమ్మర యత్నాలు సాగిస్తున్నట్లు చర్చించుకుంటున్నాయి. ఇందుకోసం రూ.25 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

ఒక్కచోటే కుదిస్తే అభ్యంతరం రాదా?

మున్సిపాలిటీలో మూడుచోట్ల రోడ్డు వెడల్పు పనులు చేపట్టనుండగా ఆఖరు దశలో ఓ రోడ్డును 40 ఫీట్లకు కుదించేలా యత్నాలు సాగిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. ఓ ప్రాంత రోడ్డును కుదిస్తే ఇతర ప్రాంతాల ప్రజలు ఊరుకునే అవకాశాలు ఉండవని అంటున్నారు. తమ ప్రాంత రోడ్లనూ కుదించాలని ఆందోళనలు సాగించే అవకాశాలు లేకపోలేదు. ముందుగా నిర్దేశించుకున్న ప్లానింగ్‌ను మార్చడంతో అభాసుపాలయ్యే అవకాశాలు మెండుగా ఉండనున్నాయి. మరి ఈ పరిస్థితుల్లో అధికారుల నుంచి ఫైనల్ ప్లానింగ్ రిపోర్టు ఏ తీరుగా వస్తుందో వేచి చూడాల్సిందే.

ప్రత్యామ్నాయం చూపాలి



భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ జరగాలి. కానీ, రోడ్డు వెడల్పు చేయడంతో ఇళ్లు, దుకాణాలు కోల్పోయే బాధితులకు ముందస్తుగా ప్రత్యామ్నాయం చూపాలి. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్లానింగ్ అప్రూవల్ లేనిది ఎస్టిమేట్ ఎలా వేశారో అధికారులకే తెలియాలి. ఇప్పుడేమో ఓ రోడ్డును కుదిస్తారనే ప్రచారం జరుగుతోంది. అలా చేస్తే ప్రజల్లో అనుమానాలు కలుగుతాయి. అలా జరగకుండా చూడాలి.

– బీజీ శంకర్‌సింగ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

గాలివాన బీభత్సం


వేలాల శివారులో జలమయమైన పంట పొలాలు

జైపూర్: జైపూర్ మండలం వేలాల గోదారి తీర ప్రాంతంలో పంటలు మరో సారి నీట మునిగాయి. ఎగువప్రాంతాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చడం గోదావరి నదికి వరద నీరు ఉప్పొంగడంతో తీరప్రాంత పంట పొలాలు జలమయమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వేమనపల్లి: మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. పత్తి పంటలు నేలకొరిగాయి. ఎంపీడీవో కార్యాలయం గేట్ వద్ద చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. కొత్తారి సమ్మయ్య పెరట్లో ఉన్న చెట్టు వేర్లతో సహా నేలకూలింది. పాత బస్టాండ్ వద్ద మంత్రి మల్లేష్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ షెటర్ డబ్బా గాలికి ఎగిరిపడింది. చల్ల రాజన్న ఇంటి వద్ద విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టారు.

తెగిన మేడిచెరువు తూము కట్ట

రామకృష్ణాపూర్: భారీ వర్షాల కారణంగా మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారి ఖిల్లా సమీపంలోని మేడిచెరువు తూము కట్ట బుధవారం తెగింది. దీంతో చెరువులోని నీరు పెద్ద ఎత్తున వృథాగా పోయింది. రెండు పశువులు కూడా నీటి తాకిడికి కొట్టుకుపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాల కారణంగా నిండా నీటితో నిండుకుండను తలపించిన మేడిచెరువు ప్రస్తుతం కట్టలు తెగిపోవడంతో ఎండిపోయే పరిస్థితి దాపురించింది. మేడిచెరువు తూము కట్టలు బలహీనంగా ఉన్న విషయం ఇటీవల గ్రామస్తులు మంత్రి వివేక్, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.14.80లక్షలు కూడా మంజూరు చేశారు. అయితే వర్షాల కారణంగా టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావటంతో మరమ్మతు చేపట్టలేదు. ఇప్పటికైనా తాత్కాలిక పనులతో చేతులు దులుపుకోకుండా మేడిచెరువుతో పాటు గతేదాది గండిపడ్డ గ్రామంలో గల ఊర చెరువుకు కూడా శాశ్వత పనులు చేపిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కాగా తెగిపోయిన తూము కట్టలను ఇరిగేషన్ డీఈ శారద పరిశీలించారు. త్వరలోనే టెండర్లు పిలిచి కట్టల నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు.

అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు


బెల్లంపల్లి: బతుకమ్మలతో బాలికలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రకృతిలో విరబూసిన తంగేడు, గునుగు, కట్ల, బీర, సీతమ్మ జడ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కళాశాల ఆవరణలో ఆడి పాడారు. సాంప్రదాయ వస్త్రాలు ధరించి వేడుకలకు హాజరైన బాలికలు బతుకమ్మ పాటలపై సామూహికంగా నృత్యాలు చేసి అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అంజయ్య ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డు స్కూల్ అసిస్టెంట్ ఇ.సువర్ణ, సీనియర్ లెక్చరర్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి, ఉయ్యాల పాటలు పాడుతూ విద్యార్థినులు బతుకమ్మ ఆడి సందడి చేశారు. ప్రిన్సిపాల్ శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ బాగు

- ముళ్ల పొదల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



శ్రీరాంపూర్: నస్పూర్ గోదావరి కాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియం వాకింగ్ ట్రాక్ అధ్వానంగా మారిందని, వాకింగ్ ట్రాక్‌లో తుమ్మచెట్లు పెరిగి క్రీడాకారులకు ఇబ్బందిగా మారిందని ఈ నెల 22న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సివిల్ విభాగం అధికారులు స్పందించారు. రెండు రోజులుగా మైదానంలో ఉన్న తుమ్మ చెట్లు, ఇతర ముళ్ల పొదలను నరికేసి, పిచ్చిమొక్కలను తొలగించి వాకింగ్ ట్రాక్‌ను బాగు చేశారు. దీంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు


దండేపల్లి: ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి: దండేపల్లి మండల విద్యాధికారిగా రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం మంత్రి రాజును నియమిస్తూ, జిల్లా విద్యాశాఖ అధికారి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన దుర్గం చిన్నయ్య అనారోగ్య సమస్యలతో విధుల నుంచి తప్పుకోవడంతో రాజుకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, మండలంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

భీమిని ఎంఈవోగా వెంకటస్వామి

భీమిని: మండల విద్యాధికారిగా (ఎంఈవో) భీమిని ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం వెంకటస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంఈవోగా విధులు నిర్వహించిన కృష్ణమూర్తి తమ వ్యక్తిగత సమస్యలతో విధుల నుంచి తప్పుకోగా, నూతనంగా వెంకటస్వామి ఎంపికయ్యారు. కాగా తోటి ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ సంబురాలు


నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

పాతమంచిర్యాల: మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ సంస్థ ఆవిర్భావ వేడుకలను బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలే అందించిన ఉద్యమ స్ఫూర్తితో నేటి కాలపు పోరాటాలను చేపట్టడానికి బీసీ బిడ్డలు ముందుకు రావాలన్నారు. కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సత్య ప్రచారక్ సమాజ్ నాయకులు మొగిళి, లక్ష్మణ్, రిటైర్డ్ జడ్జి కనికరపు రాజన్న, సామాజిక ఉద్యమ నాయకులు కామెల్ల జయ రావు, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, నీరటి రాజన్న, కైలాసం, బుస్స యాదగిరి, అన్నం రమేశ్, చలమల్ల అంజయ్య, పాటి రాజు, మోతే రామదాసు, చిట్టవేన రాజు, పున్నం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

బెల్లంపల్లిరూరల్: నేత్రదానం చేయడం గొప్పదానమని, నేత్రదానం చేయడంలో ఉన్న అపోహలను వీడి ప్రజలు నేత్రదానాలకు ముందుకు రావాలని బెల్లంపల్లిరూరల్ సీఐ చందవోలు హనోక్, సదశయా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తిలు అన్నారు. బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో బుధవారం ఇటీవల మరణించి తన కళ్లను దానం చేసిన జంగపల్లి రాజారాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై రాజారాం కళ్లను దానం చేసిన కుటుంబీకులకు ప్రశంసా పత్రం అందజేసి, శాలువాలతో సత్కరించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానికి ముందుకు రావాలని వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొంగల మల్లేశ్, జనహిత సేవా సమితి సభ్యుడు భీమిని కనకయ్యలు నేత్ర, అవయవదానానికి ముందుకు రాగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, కోశాధికారి గిరిప్రసాద్, సభ్యులు రాజన్న, సుకుమార్, రాజారాం కుటుంబీకులు లక్ష్మి, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవికి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


బెల్లంపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో దుర్గాదేవి నవరాత్రి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. భక్తులకు దుర్గాదేవి బుధవారం అన్నపూర్ణదేవీ అవతారంలో దర్శనం ఇవ్వగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీలోని 33వ వార్డు హనుమాన్ బస్తీలో భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, బస్తీవాసులు, భవానీ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట్ రోడ్ నంబర్ –1లో శివపంచాయితన ఆలయంలో మణికంఠ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత బుధవారం శాకంబరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,భక్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎస్వోటు జీఎం సత్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణ తెలిపారు. సంబరాలు నిర్వహించే కృష్ణాకాలనీ శాంతి మైదానంను బుధవారం ఆయన సందర్శించారు. మహిళలకు ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్యామిలీ డే కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సివిల్ ఇంజనీర్ గుండె రావు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని 39వ డివిజన్ పోచమ్మ చెరువు కట్టపై ఉన్న బతుకమ్మ ఘాట్లను బుధవారం కమిషనర్ కె.సంపత్ కుమార్ పరిశీలించారు. బతుకమ్మ మెట్లకు రంగులు వేసి, పిచ్చి మొక్కలు తొలగించాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను వార్డు మాజీ కౌన్సిలర్ పూదరి సుజాత, ప్రభాకర్‌లు విన్నవించడంతో అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.వైకుంఠం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, జవాన్ భానుచందర్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో రోడ్డుకు మరమ్మతు


రోడ్డును బాగుచేసుకుంటున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు లింగన్నపేట, ఎదులబంధం గ్రామాల అటవీ ప్రాంతంలో వరద ఉధృతికి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. 12గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగింది. కాగా జనగామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ కలిసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేసుకున్నారు.

సోయి బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం సోయి బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకావిష్కరణ జరిగింది. బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కాకతీయ విశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్‌కుమార్ రచించిన 'సోయి బీసీ ఉద్యమ సాహిత్య' పుస్తకాన్ని బీసీ శ్రేణులు అట్టహాసంగా విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బీసీ మహిళాసంఘం జిల్లా అధ్యక్షురాలు సువర్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తొంగల మల్లేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.రాజలింగు, సమన్వయకర్తలు తొంగల శ్రీనివాస్, గజ్జెల్లి మోహన్, మద్దెర్ల శ్రీనివాస్, వేల్పుల రాజేందర్, బీసీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిధుల దుర్వినియోగంతో సంబంధం లేదు'

దండేపల్లి: దండేపల్లి కేజీబీవీలో జరిగిన నిధుల దుర్వినియోగానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, అకౌంటెంట్ ఉషా పేర్కొంది. దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిధుల దుర్వినియోగంలో ఎస్వో మంజులతో పాటు తనపై అభియోగం మోపి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇందుకు గాను దానికి తగిన వివరణ ఇచ్చుకున్నప్పటికీ, అధికారులు ఎలాంటి విచారణ చేయకుండానే తనను విధుల నుంచి తొలగించారని వాపోయింది. ఎస్వోను మూడు నెలలక్రితం విధుల నుంచి తొలగించి, తీరా ఇప్పుడు తనపై అభియోగం మోపి విధుల నుంచి తొలగించి తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విషయమై డీఈవో యాదయ్యను వివరణ కోరగా.. షోకాజ్‌కు వివరణ తీసుకుంటాం తప్పా దాని ఆధారంగా మళ్లీ విచారణ అనేది ఉండదన్నారు. గతంలో జరిపిన విచారణ ఆధారంగానే షోకాజ్ నోటీస్ జారీ చేశాం అన్నారు.

యూరియా కోసం వర్షంలోనూ బారులు


క్యూలైన్‌లో రైతులు

కోటపల్లి/చెన్నూర్‌రూరల్: రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. బుధవారం కోటపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా బస్తాల కోసం వర్షంలోనూ రైతులు బారులు తీరారు. చెన్నూర్ మండలం కాచన్‌పల్లి గ్రామ రైతులకు 266 బస్తాలు రాగా, బుధవారం అంగ్రాజ్‌పల్లి రైతువేదికలో జిల్లా ఇంచార్జ్ వ్యవసాయాధికారి సురేఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఏవో యామిని, ఏఈవోలు అర్చన పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉపాధ్యాయుడికి సన్మానం


సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టంకశాల నరేందర్‌రావు అనే రిటైర్డు ఉపాధ్యాయుడిని 1995–96లో పదో తరగతి చదివిన విద్యార్థులు సన్మానించారు. ఈ మేరకు ఎంఈవో గోపాల్‌రావు మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యనేర్పిన ఉపాధ్యాయుడిని గుర్తుంచుకొని ఇప్పుడు సన్మానించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

• నియామకం

పాతమంచిర్యాల: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రియాంక కక్కర్ ఆదేశాల మేరకు జిల్లాల అధ్యక్షులను నియమించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నయీం పాషాను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు.

• సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, స్త్రీల వైద్య నిపుణురాలు శ్రావ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, చిన్న పిల్లలకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉమా శ్రీ, లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• అలరించిన అష్టావధానం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో బ్రాహ్మణ సేవ సంఘం భవనంలో శతావధాని ఎంవీ పట్వర్ధన్ ఆధ్వర్యంలో నాగేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన అష్టావధానం ఆహుతులను అలరించింది. అనుసంధాన కర్తలుగా జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, ముక్తేశ్వర్, వేదాంతం సురేశ్‌శర్మ, దండనాయకుల వామన్‌రావు, కొమ్మెర రాంమూర్తి, కొమ్మె సౌజన్య, రామకృష్ణమూర్తి, శ్రీరాంభట్ల శ్రీనివాస్‌శర్మ వ్యవహరించారు.